www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 ఆగస్టు 2023

5

వైఎస్ఆర్

వైఎస్ఆర్ ఎఎఫ్ఎయు పరీక్షా ఫలితాలు విడుదల

కడప అర్బన్ : నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని ఆర్కిటెక్చర్ విభాగాని సంబంధించిన 2,4,6వ సెమిస్టర్, రెగ్యులర్ పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్ రెడ్డి విడుదల చేశారు. శనివారం విశ్వవిద్యాలయంలో పరీక్ష విభాగంలో కలిసి ఫలితాలను స్క్రీన్ పై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ సెమిస్టర్ లో 93 శాతం, నాలుగవ సెమిస్టర్‌లో 83 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్ సైట్‌లో పొంద పరిచామన్నారు. అతి తక్కువ సమయంలోనే పరీక్ష ఫలితాలను విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్ష విభాగాన్ని వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి, అదనపు పరీక్ష నియంత్రణ అధికారి డాక్టర్ సుప్రియ, పరీక్షల నియంత్రణ సహాయ అధికారి ఉదయ ప్రకాష్ రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

జిజిహెచ్‌కు 'చెద'

- హాస్టళ్లలో చెదల స్వైరవిహారం
- తలుపుల నుంచి ర్యాకుల వరకు..
- వైద్య విద్యార్థులకు తప్పని ఫీట్లు
- జాడే లేని పెస్ట్ కంట్రోల్ సిబ్బంది
- అంతులేని నిర్లక్ష్యంలో ప్రిన్సిపల్

జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలకు చెదపట్టింది. ప్రభుత్వం క్రిమికీటకాదులు మొదలు చెదులు నివారణ కాంట్రాక్టును తెలంగాణకు చెందిన శ్రీసాయి సెక్యూరిటీస్ ఏజెన్సీకి అప్పగించిం ది. సదరు కాంట్రాక్టర్ తెలంగాణలో ఉన్న నేపథ్యంలో జిజిహెచ్ కాంట్రాక్టు పర్యవేక్షణ భారంగా మారినట్లు కనిపిస్తోంది. ఫలితంగా జిజిహెచ్ వైద్య విద్యార్థినుల హాస్టళ్లలో చెదలు నివారణ ప్రశ్నార్థకంగా మారింది. హాస్టల్ వైద్య విద్యార్థులకు పాట్లు తప్పడం లేదు. దీనిపై జిజిహెచ్ ప్రిన్సిపల్స్ పర్యవేక్షణ కొరవడిన నేపథ్యంలో చెదల నివారణ బాధను ఎవరికి చెప్పకోవాలో తెలియడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది.

చెదలు పట్టిన తలుపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలకు పర్యవేక్షణ కొరవడింది. జిజిహెచ్ పరిధిలో యుజి ఉమెన్స్ హాస్టల్, పీజీ హాస్టల్, హౌస్ సర్జన్స్ హాస్టల్, బాయిస్ హాస్టల్స్ ఉన్నాయి. ఉమెన్స్ హాస్టళ్లలో 200 మంది యుజి వైద్య విద్యార్థినులు నివసిస్తున్నారు. ప్రతి గదికి ఇద్దరు నుంచి ముగ్గురు చొప్పున ఉంటున్నారు. ఎన్నో ఆశల, కలల మధ్య వైద్య విద్యను అభ్యసించడానికి వచ్చిన విద్యార్థినులకు ఇక్కడ కల్పించిన వసతి సదుపాయాలను చూసి నివ్వెర పోతున్నారు. విద్యార్థులకు కేటాయించిన గదుల తలుపుల దగ్గర నుంచి ర్యాకుల వరకు చెదలు స్వైరవిహారం చేస్తోంది. హాస్టల్ తలుపుల దగ్గర నుంచి ర్యాకుల్లో ఏర్పాటు చేసుకున్న మెడిసిన్ పుస్తకాలకు, దుస్తులకు సైతం చెదలు వ్యాపిస్తోంది. ఫలితంగా వైద్య విద్యార్థినులు తరుచుగా పుస్తకాలను, దుస్తులను, దుప్పట్లను దులుపుకుని తరుచుగా మార్చుకోవాల్సి వస్తోంది. హాస్టల్‌ను ఆసాంతం తలుపులను, ర్యాకుల (కబోర్డులు) చెక్కలను పరిశీలిస్తే చెదలు పట్టి తినేస్తున్న దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది. నెలల తరబడి హాస్టళ్ల నిర్వహణను పట్టించుకునే నాధుడు కరువు కావడంతో హాస్టళ్ల తలుపులను తరుచుగా మార్చుకోవాల్సి వస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. జిజిహెచ్‌లో పెస్ట్‌కంట్రోల్ సిబ్బంది, జిజిహెచ్ ప్రిన్సిపల్, కాంట్రాక్టర్ పర్యవేక్షణను పరిశీలిస్తే అంతులేని నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రతి నెలా పెస్ట్‌కంట్రోల్ కాంట్రాక్టర్‌కు జిజిహెచ్ బాధ్యులు బిల్లుల చెల్లింపులు ఎలా చేస్తున్నారనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. జిజిహెచ్ హాస్టళ్లలో చెదల స్వైరవిహారం చేస్తున్న నేపథ్యంలో పరిశీలించిన తర్వాత బిల్లులు చెల్లింపులు చేయడంలోనే మతలబేమిటనే వాదన వినిపిస్తోంది. ప్రిన్సిపళ్లతో, కాంట్రాక్టర్ల కుమ్మక్కు ఫలితంగానే ఇటువంటి అధ్వాన్న పనితీరును చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే వాదన వినిపిస్తోంది. జిజిహెచ్ పర్యవేక్షణ బాధ్యతల్ని స్వీకరించిన కార్పొరేషన్ కమిషనర్ కార్పొరేషన్ తరహాలోనే జిజిహెచ్ ఆవరణంలోని పిచ్చి, కంపచెట్లను తొలగించి, చెదల నివారణపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది.

విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వాలు

ఎస్ఎఫ్ఐ స్కూటర్ యాత్రలో నాయకులు

బద్వేలు : మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్

ప్రజాశక్తి-బద్వేల్

పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదనవిజయ్ కుమార్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థి సంగ్రామ స్కూటర్ యాత్ర బద్వేల్‌కు చేరుకుంది. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తామని అధికా రంలోకి వచ్చిన పాలకులు పూర్తిగా విస్మరి ంచారని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వల్ల ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంద న్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయకుండా, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకుండా విద్యార్థులు ఎలా చదువులు కొనసాగించాలని వారు ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన మెడికల్ కళాశాల్లో 50 శాతం సీట్లు అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, డివైఎఫ్ఐ పట్టణ నాయకులు ఆంజనేయులు, బాల గురవయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, సిఐటియు నాయకులు హరి, నరసింహ ,రాయప్ప, నాయకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల టౌన్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూటర్‌యాత్ర పోరు మామిళ్ల పట్టణానికి చేరుకుంది.ఇ స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మండల కమిటీ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి, మండల నాయకులు భాను, సుమంత్, రాజ శేఖర్, అజయ్, ప్రవీణ్,సందీప్ పాల్గొన్నారు.

కలసపాడు : కలసపాడుకు చేరిన స్కూటర్ యాత్ర కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థినులతో మౌలిక సదుపాయాలపై నాయకులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. హాస్టల్‌లో తాగునీరు, వసతి, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. సరైన సమయానికి హాస్టల్లో బెడ్ సీట్లు పెట్టెలు దొంతర్లు అందించాలని వారు హాస్టర్ నిర్వాహకులకు తెలియజేశారు. విద్యార్థుల సమస్యలపై తాము ఎప్పుడు విద్యార్థులకు వెన్నంటూ ఉంటామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల ఎస్ ఎఫ్ ఐ నాయకులు, వీర పోగు రవి, తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయ పరిష్కారం కోసం శాశ్వత లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప

పర్మినెంట్ లోక్ అదాలత్ (పిఎల్ఎ) ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి.గీతా పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ భవనంలో 'శాశ్వత లోక్ అదాలత్' ఆధ్వర్యంలో పర్మనెంట్ లోక్ అదాలత్ ఛైర్మన్ స్వర్ణ ప్రసాద్ అధ్యక్షతన ప్రజా ప్రాయోజిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై ప్రభుత్వ శాఖల అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాశ్వతలోక్ అదాలత్ అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం కల్గిన వారికి ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయం పరిష్కరిస్తుందని చెప్పారు. పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. పర్మనెంట్ లోక్ అదాలత్ ఛైర్మన్ స్వర్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదని, దీని ద్వారా 10 రకాలైన ప్రజా ప్రయోజిత సేవా రంగాలకు సంబంధించిన సేవలలో త్వరితగతిన న్యాయ పరిష్కారం పొందవచ్చన్నారు మరిన్ని వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మనెంట్ లోక్ అదాలత్ కార్యాలయంలో లేదా 8639 684279, 9963731698లలో సంప్రదించాలని చెప్పారు.

ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలి

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఛైర్మన్ జి. గీత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం ప్రదీప్ కుమార్ పిలు పునిచ్చారు. సెప్టెంబర్ 9న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం జిల్లా కోర్టులో ముందస్తు సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న విసి చింతా సుధాకర్

చిన్న తరహా పారిశ్రామికవేత్తలు కావచ్చు

ప్రజాశక్తి- కడప అర్బన్

తక్కువ పెట్టుబడితో పుట్టగొడుగుల పెంపకం ద్వారా చిన్న తరహా పారిశ్రామికవేత్తగా ఎదగవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. శనివారం యోగి వేమన విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ మష్రూమ్ కల్టివేషన్ సెంటర్ సమన్వయకర్త ఆచార్య చంద్రమతి శంకర్ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకం పై నాగార్జున మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జొన్న విత్తనాల పుట్టగొడుగుల విత్తనాలు ఎలా తయారు చేస్తారు, వాటి పెంపకానికి గడ్డి, బెడ్ ప్రిపరేషన్, గురించి ప్రయోగాత్మకంగా, థిరాటికల్‌గా వివరించి అవగాహన కల్పించారు. సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమానికి హాజరైన విసి మాట్లాడుతూ మష్రూమ్ కల్టివేషన్ మంచి ఆదాయం వనరు అని, గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఈ వ్యాపారం చేయవచ్చు అన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య చంద్రమతి శంకర్ మాట్లాడుతూ నాణ్యమైన పుట్టగొడుగులకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. అతిథులు విసి చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ల్యాబ్ సిబ్బంది దిలీప్ పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకురాలు మదర్‌థెరిసా

కడప : దేశంలో ఉన్నతమైన బిరుదు భారతరత్న అందుకున్న మహనీయురాలు మదర్ థెరిసా అని ప్రముఖ న్యాయవాది షేక్ అమీన్ పీర్ పేర్కొ న్నారు. శనివారం మదర్‌థెరిసా జయంతి సందర్భంగా రాయల్ కరీం సేవా సమితి ఆధ్వ ర్యంలో నగరంలోని సిఎస్ఐ పాఠశాలలో నిర్వహి ంచిన కార్యక్రమంలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధినేత అబ్దుల్ కరిముల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.

ల్యాబ్ సౌకర్యం లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఉమ్మడి జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల దగ్గర నుంచి వేలాది రూపాయలు వివిధ ఫీజుల రూపంలో వసూలు చేస్తూ వాళ్లకు ల్యాబ్ సౌకర్యం కల్పించడం లేదని, ల్యాబ్ సౌకర్యం కలిపించేటట్లు ఆయా కళాశాలల పై విచారణ జరిపి చర్య తీసుకోవాలని పిడిఎస్ యు నాయకులు కోరారు. శనివారం ఆర్ఐఒ రమణ రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు నగర అధ్యక్షుడు ఎన్.గణేష్, సహాయ కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలో కడప నగరం, రాయచోటి, బద్వేల్, మైదుకూరు, రైల్వేకోడూరులో కార్పొరేట్, ప్రయివేట్ జూనియర్ కళాశాలలు యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల దగ్గర నుంచి వివిధ రకాలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని తెలి పారు. వారికి ల్యాబ్ సౌకర్యం కల్పించకుండా మోసం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నగర నాయకులు భరత్ కుమార్, హబీబుల్లా, నాగన్న, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురావాలి

ప్రజాశక్తి- కడప

ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) దృష్టికి తీసుకురావాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎం. ప్రదీప్ కుమార్ అన్నారు. శనివారం నగరంలోని చౌడమ్మ వృద్ధాశ్రమంలో న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన నల్సా పథకం - 2016 గురించి వివరించారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, ఆంధ్ర ప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011 గురించి తెలియజేశారు.

మాట్లాడుతున్న అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్

నగరంలో అభివృద్ధి పనులు ముమ్మరం : డిప్యూటీ సిఎం

కడప అర్బన్ : ఎన్నడూ లేని విధంగా కడప నగరంలో అభివృద్ధి పనులు చేపట్టామని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్‌బి అంజాద్‌బాషా పేర్కొ న్నారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సాధారణ నిధుల నుంచి స్థానిక అక్కా యపల్లె పరిధిలో పార్కు, ఐటిఐ సర్కిల్ వద్ద గాంధీ పార్కు, బాలాజీ నగర్ లోని హిందూ శ్మశాన వాటికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెమ్ముమియా పేట ప్రాంతంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో పార్కును ప్రారంభోత్సవం చేశామని పేర్కొన్నారు. నగరంలో ఒక ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడానికి పార్కు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, వైసిపి సీనియర్ నాయకులు అఫ్జల్ ఖాన్, స్థానిక కార్పొరేటర్లు వి.హేమలత, వి రామకృష్ణారెడ్డి, షేక్ మొహమ్మద్ షఫీ,పాక సురేష్ బండి ప్రసాద్, సూర్యనారాయణ, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి , తోట కృష్ణ, జమాల్ బాషా, సిహెచ్ సునీల్ కుమార్, మున్సిపల్ ఎస్ ఈ రత్నాల రాజు, ఎఇ దిల్షాద్ పాల్గొన్నారు.

పార్కును ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం, కమలాపురం ఎమ్మెల్యే

యాంటీ ర్యాగింగ్ పోస్టర్లు ఆవిష్కరణ

కడప అర్బన్ : విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విసి ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ అన్నారు. శనివారం యూనివర్సిటీలో ర్యాగింగ్ పర్యవసానాలను తెలి యజేసే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్ఆర్ ఎఎఫ్ఎయు క్యాంపస్‌ను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్యార్థులంతా ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ర్యాగింగ్ కు పాల్పడి విద్యార్థులు తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ర్యాగింగ్ నియంత్రణకు వర్సిటీలో ప్రత్యేక కమిటీలను నియమించామని తెలిపారు. హాస్టల్స్, భోజనశాలలు, క్యాంటీన్లు, మైదానాలు తదితర ప్రదే శాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ ఇసి సురేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్‌ను పూర్తి స్థాయిలో నిరోధిస్తామన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, మీ తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆదేశాల మేరకు యాంటీ ర్యాగింగ్ పోస్టర్ డిజైన్,లోగో డిజైన్ ,వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్ కుమార్ రెడ్డి, యాంటీ ర్యాగింగ్ కమిటీ మెంబెర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విసి ఆచార్య ఆంజనేయ ప్రసాద్

జాబ్ మేళాకు విశేష స్పందన

కడప : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీతో పాటు ప్రతి విద్యార్థికి ఒక ఉద్యోగం ఇవ్వాలనే లక్ష్యంతోనే మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం కళాశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో నిర్వహిస్తున్న మహా జాబ్ మేళాలో భాగంగా శనివారం కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పాసైన విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ప్రారంభించి మాట్లాడారు. మహా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని అన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ దాదాపు 2640 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 80 శాతానికి పైగా విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. కర్నూలు, అన ంతపురం జిల్లాల ఆర్జెడి డాక్టర్ నాగలింగారెడ్డి, చిత్తూరు, కడప జిల్లాల ఆర్జెడి డాక్టర్ బాబు, కమిష నరేట్ ఒఎస్‌డి డాక్టర్ అనిల్ కుమార్, అకడమిక్ ఆఫీసర్ డాక్ట్టర్ సుధాకర్, నంద్యాల కళాశాల ఎన్ఆర్‌సి ప్రిన్సిపల్ శశికళ, ఉద్యోగులు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర ఇబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

లబ్ధిదారులకు మాత్రమే లీజు హక్కు

కడప : జెడ్‌హెచ్‌డిసి భూములు కేటాయించిన లబ్ధిదారులకు మాత్రమే లీజు హక్కు కలిగి ఉంటారని, ఏదైనా సమస్య ఉన్నట్లయితే కడప కలెక్టరేట్‌లోని ఎస్‌సి కార్పొరేషన్ కార్యనిర్వహక సంచాలకులను సంప్రదించవచ్చునని ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ హెచ్. వెంకటసుబ్బయ్య తెలిపారు. కడప జిల్లాలోని జెడ్‌హెచ్‌డిసి భూములను సంబంధిత కడప ఎస్సీ కార్పొరేషన్ వారు గతంలో లీజుకు కేటాయించిన లబ్ధిదారులు మాత్రమే కౌలుదారులుగా హక్కులు కలిగి ఉన్నారని తెలిపారు.

గ్రామ కో-ఆర్డినేటర్లకు న్యాయం చేయాలి

బి. కోడూరు : సాక్షర భారత్ గ్రామ కో-ఆర్డినేటర్లకు న్యాయం చేయాలని మున్నెల్లి పంచాయతీకి చెందిన ఒకిలి రామలమ్మ కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పది వేల మందిని గ్రామ, మండల కో-ఆర్డినేటర్లను పది, డిగ్రీ అర్హతతో ఎంపిక చేసిందని చెప్పారు. తరువాత 2018లో అన్ని రాష్ట్రాల్లో సాక్షరభారత్ కార్యక్రమాన్ని నిలిపేశారని, తరువాత అప్పటి ప్రతిపక్ష నాయ కులు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంలో సమస్యను విన్నవించామని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందరికీ తిరిగి ఉద్యోగాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. 2022-23 సంవత్సరంలో కేవలం మండల స్థాయిలో పనిచేసేవారిని తిరిగి విధుల్లోకి తీసు కున్నారని తెలిపారు. కానీ గ్రామ స్థాయి కో- ఆర్డి నేటర్లకు ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్ట లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి అర్హత కల్గిన వారికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

అర్హులందరూ వైఎస్ఆర్ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని డిఎంహెచ్ఒ నాగరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొలుములపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. డాక్టర్ వై.ఎస్.ఆర్ హెల్త్ క్లినిక్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం చింతకొమ్మదిన్నెలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న డాక్టర్ వై.ఎస్.ఆర్ కంటివెలుగు కార్యక్రమాన్ని సమీక్షించి లబ్ధిదారులకు కంటి అద్దాలను అందజేశారు. చివరగా చింతకొమ్మదిన్నె ప్రాతమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై సంతృప్తిని వ్యక్తపరచి స్థానిక వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్రను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా డేటా మేనేజర్ రెడ్డయ్య, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీ ప్రసాద్ , పిఎంఒఒ కరుణాకర్, ఆరోగ్య పర్యవేక్షకులు మోహన్ రెడ్డి జనార్దన్, జయరత్న, మహిళలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న డిఎంహెచ్ఓ

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

ప్రజాశక్తి- కడప

విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం జిల్లా వ్యాప్తంగా ఆదివారం విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధాతథంగా పనిచేస్తాయని, విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులు చెల్లించి సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మొక్కుబడి

ప్రజా'దృష్టి'

జిల్లా పరిషత్, కార్పొరేషన్, డిఆర్‌సి సమావేశాలు, నామమాత్రంగా సాగిపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా పరిషత్, డిఆర్‌సి, కార్పొరేషన్ సమావేశాలనగానే ప్రజలు తమ సమస్యలను పరిష్కరిస్తారనే ఆలోచన ఉంటుంది. ఇటువంటి ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ, కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం దేనికో తెలియడం లేదు. జిల్లా పరిషత్ అధికార యంత్రాంగం స్టాండింగ్ కమిటీ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులను రివ్యూ పేరిట పిలిచిన ప్రగతి నివేదికను చదవించడానికి పరిమితం కావడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. వేంపల్లి ఎంపిపి మినహా మిగిలిన జడ్పీటిసిలు జిల్లా ప్రగతిపై సమాధానాలు, రాబట్టుకోవాలనే ప్రయత్నం చేసిన పాపానపోలేదు. ప్రతిపక్షపార్టీ సభ్యులు లేకపోవడంతో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందరని చెప్పవచ్చు. ప్రగతి నివేదిక చదివే సంబరానికి జిల్లాస్థాయి అధికారులను సమావేశానికి పిలవడం దేనికి, కింది స్థాయి అధికారులైతే సరిపోతుంది కదా అనే విమర్శలు బాహాటంగా వినిపించడం గమనార్హం. ముందుగా జిల్లా పరిషత్ పాలకవర్గం సభ్యులను సమావేశానికి హాజరయ్యేలా చూడడం, అనంతరం ప్రజల సమస్యలను అధ్యయనం చేసి హాజరు కావాల్సిన అవసరాన్ని ఎత్తి చూపించింది. జిల్లా పరిషత్ ఛైర్మన్ హాలులో విడతల వారీగా అధికారులు హాజరు కావడం గందరగోళానికి తావిస్తోంది. ఎవరు ఎప్పుడు వస్తారు, ఎవరు హాజరు కాబోరనే సందేహం నెలకొంది. జడ్పీ ఛైర్మన్ ఛాంబర్ గాకుండా జిల్లా పరిషత్ సమావేశ హాలును ఉపయోగించుకుంటే జిల్లా స్థాయి అధికారులు, జడ్పీటిసిల హాజరు శాతం పెరిగే అవకాశం ఉంటుందని చెప్పవచ్చు. ఫలితంగా సమావేశాల నిర్వహణ సీరియస్‌గా తీసుకునే అవకాశం ఉంటుంది. లేనిపక్షంలో అధికారంలో ఉండే పార్టీ కావడంతో పాలక మండలి, ప్రభుత్వ లోపాలను ఎత్తి చూ పించే ధైర్యం అధికార పక్ష సభ్యులకు లేదనేది బహిరంగ రహస్యం. 2024 సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న సందర్భంగా కార్పొరేటర్లలో గెలుపు భయం పట్టుకుంది. పలువురు కార్పొరేటర్లు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశాల్లో కొంతమంది సభ్యులు గళం వినిపిస్తున్నారు. జిల్లా పరిషత్ పాలక వర్గంలో అటువంటి ఆందోళనే కనిపించడం లేదు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంతోపాటు డిఆర్‌సి సమావేశాన్ని కూడా మధ్యాహ్నం నుంచి మమ అనిపించడం పరిపాటిగా మారింది. నిజం సిగ్గుచేటని చెప్పుకోవచ్చు. ఇటువంటి మొక్కుబడి సమీక్షల కారణంగా జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారుతోందనే వాదన వినిపిస్తోంది. జిల్లా పరిషత్ సభ్యులు మండలాల పరిధిలోని ప్రజల సమస్యలను ప్రస్తావించి, అధికారులతో సమర్థవంతంగా పనిచేయించుకుని, ప్రజల మన్నన పొందాలనే ఉద్దేశం లేనట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారం నెరుపుతున్న పార్టీ కావడంతో మిన్నకుండి పోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. అధికార పార్టీ కావడంతో జిల్లాలోని అభి వృద్ధి పనులకు నిధుల వరద పారించే అవకాశం ఉన్నప్పటికీ అటువంటి అవకాశం కూడా కనిపించడం లేదు. ఏదేమైనా జిల్లాలోని ప్రధాన బాడీలైన కార్పొరేషన్, జిల్లా పరిషత్, డిఆర్‌సి సమావేశాల్లో అర్థవంతంగా చర్చలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి- కడప ప్రతినిధి

మదర్ థెరిసాకు ఘన నివాళి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మదర్ థెరిసా జయంతి సందర్భంగా శనివారం ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నాగార్జున ఎక్సెలెంట్ ఉన్నత పాఠశాలలో మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె విద్యార్థులకు చేసిన సేవలు గురించి తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో పట్టణ పరిధిలో ఉన్న విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారికి ఎబిఎస్ హెచ్‌పిఎస్ అధినేత్రి భవ్య దొండ్లవాగు నిత్యావసర సరుకులు అందజేశారు. వారికి అన్ని విధాలా తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల నెట్‌వర్కింగ్ రాష్ట్ర అధ్యక్షులు రఘునాథరెడ్డి, పులి వెందుల నాయిబ్రాహ్మణ నాయకులు వెల్పుల జగన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సరుకులు పంపిణీ చేస్తున్న భవ్య

మానవతా మూర్తి మదర్ థెరిసా : పిసిసి

వేంపల్లె : మానవ సేవయే మాధవ సేవగా భావించిన మహోన్నత మానవతా మూర్తి మదర్ థెరిస్సా అని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మదర్ థెరిస్సా 113వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి తులసిరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదాల కన్నా సేవ చేసే చేతులు మిన్న అని మదర్ థెరిస్సా నిరూపించినట్లు చెప్పారు. మదర్ థెరిస్సా జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, రామకృష్ణ, బాలం సుబ్బరాయుడు, వేమయ్య, శివ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి నాగలింగేశ్వరచారి సూచించారు. సింహాద్రిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రతగల ప్రదేశంలో రుచికరమైన భోజనం పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణ మూర్తి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి నాగలింగేశ్వరచారి

మందుల దుకాణంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీనివాస మెడికల్ స్టోర్‌లో శనివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మందులు, ఫ్రిడ్జ్ పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దుకాణంలోని ఫ్రిడ్జ్ వద్ద పొగలు వచ్చి ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. మందులు, ఫ్రిడ్జ్, ల్యాప్‌టాప్, పర్నీచర్ కాలిపోవడంతో దాదాపు రూ. 4లక్షలు నష్టం జరిగిందని బాధితుడు శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

పొగలు దట్టంగా వస్తుండడంతో గుమికూడిన జనం

పంట నమోదు అందరి బాధ్యత

ప్రజాశక్తి - చక్రాయపేట

పంట నమోదు సమిష్టి బాధ్యత అని ఎఒ నవంత్‌బాబు తెలిపారు. ఖరీఫ్-2023లో పంట నమోదులో భాగంగా శనివారం ఆయన మారెళ్ల మడక పొలాల్లో నిర్వహిస్తున్న పంట నమోదును పరిశీలించారు. పంట సాగు చేస్తున్న ప్రతి రైతు ఆ వివరాలను ఆర్‌బికెను సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు అందవన్నారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

పంట నమోదులో అధికారులు

ప్రతి విద్యార్థిలోనూ సేవాభావం ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

సేవా భావం అనేది ప్రతి విద్యార్థిలో ఉండాలని జడ్‌పిటిసి రవి కుమార్‌రెడ్డి తెలిపారు. మదర్ థెరిస్సా 113వ జయంతి సందర్భంగా శని వారం ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు జెవి వినోద్‌కుమార్ ఛారిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జడ్‌పిటిసి మదర్ థెరిస్సా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యా ర్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. విద్యా ర్థులకు జెవి ట్రస్ట్ దుస్తులు పంపిణీ చేయడం సంతోషకరమని చెప్పారు. అనంతరం జెవి వినోద్‌కుమార్ ట్రస్ట్ అందజేసిన దుస్తులను విద్యార్థులకు జడ్‌పిటిసి, ఎంపిపి లక్ష్మిగాయత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతి నిధి బాలస్వామి, మాజీ సర్పంచు ప్రసాద రెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగన్న, సోషల్ వెల్ఫేర్ సహాయ అధికారి రామాంజులు, వసతి గృహం వార్డెన్ మాణిక్యరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపిపి, జడ్‌పిటిసి

భూములను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని కుచ్చుపాప గ్రామ సర్వే నెంబర్ 2,3,4,5లలో ఏర్పాటుకానున్న చేపల చెరువుల భూములను శని వారం జెసి గణేష్ కుమార్ పరిశీలించారు. అను మతు లు మంజూరుకు రైతుల అభ్యర్థన మేరకు ఆయన విచ్చేశారు. చేపల చెరువులను ఏర్పాటు చేయడం వల్ల పంట కాలువలు ఏవైనా తొలగించబడి ఇతర రైతులకు ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. చుట్టుపక్కల రైతులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి నివేదిక అందజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, సర్వేయర్ సాయిలత, విఆర్‌ఒలు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూములను పరిశీలిస్తున్న జెసి, అధికారులు

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ట్రాఫిక్ నిబంధనలు ప్రతి వాహనదారుడు తప్పక పాటించాలని సిఐ యుగంధర్ సూచించారు. ఎస్‌పి కెకెఎన్ అన్బు రాజన్ ఆదేశాల మేరకు శనివారం ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ సిఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు, తోపుడు బండ్ల వ్యాపారులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. యూనిఫామ్ ధరించాలన్నారు. క్రమశిక్షణతో ఆటో నడపాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో సేవలు సులభతరం

సచివాలయ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థతో ప్రజలకు సేవలు సులభంగా అందుతున్నాయిన ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరు మండల పరిధిలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామ సచివాలయ భవనాల సముదాయాన్ని శనివారం ఎమ్మెల్యే, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర సలహాదారులు నాగార్జునరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారులు తిరుపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన బోర్‌ను రూ.3.50 లక్షలతో, సిసి రోడ్డుకు రూ.5లక్షలతో, సచివాలయ భవనాల సముదాయం రూ.80 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. సచివాలయ భవన సముదాయానికి ప్రహరీ నిర్మించేందుకు రూ.10 లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో మైదుకూరు మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మండల కన్వీనర్ ప్రసాద్, సిండికేట్ బ్యాంక్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సుబ్బారెడ్డి, ఎంపిపి థామస్, ఉప ఎంపిపి రఘురామిరెడ్డి, సర్పంచు బండి నాగేంద్ర, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలి

మైదుకూరు ప్రాంత ప్రజలు పాలిటెక్నిక్ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి కోరారు. మైదుకూరుకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేసిన సందర్భంగా సిఎం జగన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ శనివారం వేలాది మంది విద్యార్థులతో అభినందన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో కడప, ప్రొద్దుటూరు వంటి దూర ప్రాంతాల్లోనే పాలిటెక్నిక్ కళాశాలలుండేవన్నారు. ప్రస్తుతం సిఎం జగన్ మైదుకూరులోనే పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో సంతోషం నెలకొందన్నారు. అనంతరం సిబ్బంది మైదుకూరులో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎ పిఒ ప్రభాకర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైస్ చైర్మన్ షరీఫ్, సింగిల్ విండో చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఎంఇఒ పద్మలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి : ఓఎస్‌డి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పులివెందుల నియోజవర్గ ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఆయన ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. గతంలో ఇళ్లు మంజూరైనప్పటికీ రూ.30 వేల లోపు బిల్లులు మంజూరైన వారు మళ్లీ ఇల్లు నిర్మించుకోవచ్చు అన్నారు. అలాగే రూ.30 వేలు పైన బిల్లులు మంజూరైన ఇంటి నిర్మాణదారులు రూ.30 వేలు పైచిలుకు డబ్బులు డిడి రూపంలో చెల్లించినచో వారు కూడా ఇళ్లు నిర్మించుకోవచ్చు అన్నారు. అలాంటి వారికి ప్రభుత్వ నిబంధన ప్రకారం రూ.1.50 లక్ష వరకు నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీలో, వ్యక్తిగత ఇంటి వద్ద స్వచ్ఛభారత్ మిషన్ కింద మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి అదనంగా రూ.6వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. జరుగుతున్న సిమెంట్ రోడ్లు నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి నాగలింగేశ్వరచారి, ఎంపిడిఒ కృష్ణమూర్తి, హౌసింగ్ డిఇ రమణారెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డి, పిఆర్ ఎఇ ఉదయ్ కుమార్‌రెడ్డి, హౌసింగ్ ఎఇ వాసుదేవరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా సమరభేరి

పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సమరభేరి నిర్వహిస్తున్నామని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరణాల శివనారాయణ తెలిపారు. ఆ మేరకు శనివారం స్థానిక ఎన్జీఒ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం శివనారాయణ మాట్లాడుతూ సిపిఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. కార్పొరేట్, బడా పెట్టుబడిదారులకు రూ.13 లక్షల కోట్లు రాయితీలిస్తూ, నూరు లక్షల కోట్లు అప్పులు చేస్తూ, పేద ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసి ఆదాయాలు రాబట్టాలని ఆదేశాలు జారీ చేస్తోందన్నారు. సరళీకరణ విధానాలను అమలు చేయకపోతే అప్పుకు అనుమతి ఇచ్చేదిలేదని అమెరికా బెదిరింపులకు లొంగిపోయిందన్నారు. ఈ విధానాలను జగన్ ప్రభుత్వం వ్యతిరేకించకుండా వాటిని అత్యుత్సాహంతో అమలు చేస్తోందన్నారు. కార్యక్రమాలను ఈనెల 30 నుండి సెప్టెంబర్ 4 వరకు వివిధ రూపాల్లో తీసుకెళ్లనున్నట్లు ఆయన వివరించారు. ఆయా ఆందోళనల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, నాయకులు బాషా, శ్రీను, భీమా, బాలు, నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని కోరేది కాంగ్రెస్ పార్టీనే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల మేలు కోరిందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు రాహుకేతువులుగా దాపురించాయని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి చాలాకాలం కాంగ్రెస్ పార్టీ దేశాన్ని పరిపాలించిందన్నారు. ఏనాడూ ఎక్కడ కూడా ప్రజలకు నష్టం లేదన్నారు. ఈ రెండు పర్యాయాలు కేంద్రంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం చేస్తున్న దురాగతాలు ప్రజలకు అర్థమైపోయిందన్నారు. ఎన్నో విధాలుగా ప్రజలను వేధిస్తోందని, ఇకనైనా మేల్కొని రాబోవు కాలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రొద్దుటూరు అసెంబ్లీ సమన్వయకర్త సుబ్రహ్మణ్యం శర్మ, ఇన్‌ఛార్జి నజీర్, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు జిలానీబాషా, సైమన్, సుగవాసి రామాంజనేయులు, రషీద్‌ఖాన్, మౌలాలి, నరసింహులు, ఉత్తన్న, అమీర్, ఓబయ్య, గుర్రప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత ఎన్.తులసిరెడ్డి

డిప్యూటీ కలెక్టర్ సాయిహర్షితకు ఘన సన్మానం

సాయిహర్షితను సన్మానిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సేవామూర్తి మదర్ థెరిస్సా 113వ జయంతిని శనివారం ఎన్‌జిఒ హోంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ కలెక్టర్ సాయిహర్షిత పాల్గొన్నారు. అనంతరం విశిష్టఅతిథులైన ప్రముఖ న్యాయవాది సివి సురేష్, ఎన్‌జిఒ హోం అధ్యక్షులు రఘురామిరెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి, సివియస్ బన్నీ ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున సాయిహర్షితను సన్మానించారు. అనంతరం మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా సాయిహర్షిత కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న రక్త దాతలను ఆమె అభినందించారు. సివి సురేష్ మాట్లాడుతూ చిన్న వయసులో డిప్యూటీ కలెక్టర్ స్థాయి సాధించడం అభినందనీయమన్నారు. రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని బీటెక్ చదివి తన లక్ష్య సాధన కోసం పట్టుదలతో కృషిచేసిన సాయిహర్షితని సత్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ తను చిన్న తనం నుండి మేదర వీధిలో ఉన్నానని, ఆ వీధి అమ్మాయి ఈ స్థాయికి రావడం చాలా సంతోషకరమన్నారు. సాయిహర్షిత మాట్లాడుతూ తాను పేదరికం నుంచి వచ్చానని, తల్లిదండ్రుల పడ్డ శ్రమ వృథా కాలేదని తెలిపారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలను అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంస్థలోని సభ్యులు మాధవ, సాయి, కోట నరసింహారెడ్డి, ఓబుల్‌రెడ్డి, అనిల్, శేఖర్, జ్యోతి, అన్సర్, శ్రీనివాసులురెడ్డి, చంద్ర నారాయణ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తింటున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యపై ప్రత్యేకశ్రద్ధ వహిస్తోందని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక, అమ్మఒడి, టాబ్స్, డిజిటల్ విద్యా విధానం, గోరుముద్దలో గుడ్లు, చిక్కీలు, రాగిజావా విద్యార్థులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరంలో 8వ తరగతి విద్యార్థులకు బైజ్యూస్ ద్వారా విద్యా విధానాన్ని ప్రారంభించామన్నారు. ఈ ఏడాది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ అందజేయనునట్లు పేర్కొన్నారు. స్మార్ట్ టివి, ఐఎఫ్‌పి ప్యానల్ ద్వారా ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులకు డిజిటల్ విద్యా విధానాన్ని చేరువ చేశామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అవసరమైన బోధనాభ్యసన విధానాన్ని డిజిటల్ విద్యా విధానం ద్వారా అర్థమయ్యే రీతిలో సులభంగా నేర్పిస్తారన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు మూతపడకుండా సిఎంఆర్‌టి ద్వారా పాఠశాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మైదుకూరు ఎంఇఒ పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాసుపోర్టులో పేరు మార్పు

కడప జిల్లా వేంపల్లె మండలం వేంపల్లె గ్రామంలోని డోర్ నెంబర్ 13/641, గండి రోడ్డులో నివాసం ఉన్న షేక్ ఫఖైర్ బాష, S/o షేక్ ఫకృద్దీన్ సాహెబ్ అని ఆధార్ కార్డులో ఉంది. (J0674964) పాసు పోర్టులో షేక్ ఫకర్ బాష S/o షేక్ ఫకురుద్ధీన్ సాహెబ్ ఉంది. ఆధార్ కార్డు ప్రకారం షేక్ ఫఖైర్ బాష S/o షేక్ ఫకృద్దీన్ సాహెబ్ గా పాసు పోర్టులో మార్చడం కోసం.

ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు ఉండొద్దు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు ఉండోద్దని ఆర్‌డిఒ శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ సభా భవనంలో శనివారం ఉదయం కొండాపురం, ముద్దనూరు, ఎర్రగుంట్ల మండలాల.. మధ్యాహ్నం జమ్మల మడుగు, పెద్దముడియం, మైలవరం మండలాల బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ చిత్తశుద్ధి, నిబద్ధతతో ఓటర్ జాబితాను తయారు చేయాలన్నారు. వలస వెళ్లినవారి వివరాలను పూర్తిగా తెలుసుకోవాలన్నారు. అన్ని నిర్ధారణ చేసుకున్నాక తొలగించి వారు ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో ఓటును నమోదు చేయాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు నమోదు తప్పనిసరన్నారు. ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థలో చాలా బలమైందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని తహశీల్దార్లు నాగేశ్వరరావు, గుర్రప్ప, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పాల్గొన్న బిఎల్‌ఒలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఆర్‌డిఒ

మార్గదర్శకాల మేరకు సర్వే చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

స్వామిత్ర సర్వేను మార్గదర్శకాల మేర కు చేపట్టాలని, ఎలాంటి తప్పులుండరాదని ఇఒ పిఆర్‌డి రాధాకృష్ణవేణి సూచించారు. శనివారం స్థానిక ఎంపిడిఇఒ కార్యా లయంలో పంచాయతీ కార్యదర్శులకు స్వామిత్ర కార్యక్రమంపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రతి ఇంటిని సర్వే చేసి రికార్డులను ఆధునీకరణ చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌పి దేవేందర్‌రెడ్డి, ట్రైనర్ జానకీరామ్ సర్వేపై సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శిక్షణనిస్తున్న ట్రైనర్ జానకీరామ్

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కొత్త ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అన్నదానం చేశారు. మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రసాద్ ఆధ్వర్యంలో కౌన్సిలర్ కోడి రమణ, అనురాధ చేపట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కోడి రమణ ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కౌన్సి లర్ పార్నపల్లి కిషోర్, నాయకులు సిద్దయ్య, నిమ్మకాయల శ్రీను, కోడి రమణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నాయకులు

గండి క్షేత్రంలో భక్తుల సందడి

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాం జనేయ స్వామి ఆలయంలో రెండవ శ్రావణ శనివారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. తెల్లవారు జామున 5 గంటలకే స్వామికి పలు రకాల అభి.షేకాలు నిర్వహించి ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజాస్వామి పూల అలంకరణ చేశారు. దేవస్థాన అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. భక్త బృందాలు నిర్వహించిన కోలాటాలు ఆకట్టుకున్నాయి. దాతల సహకారంతో అన్నదానం చేపట్టారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అవసరమైన సౌకర్యాలు కల్పించామని దేవస్థానం సహాయ కమిషనర్ అరవలపాటి ముకుందారెడ్డి, చైర్మన్ పినుగోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు.

అంజన్న దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

టిడిపి విస్తృత స్థాయి సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మంగళగిరి టిడిపి సెంట్రల్ ఆఫీస్‌లో శనివారం జరిగిన ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ప్రొద్దటూరు టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. సమా వేశానంతరం టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. టిడిపి మినీ మేని ఫెస్టో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ నాయకు లందరినీ కలుపుకొని వెళ్లి ప్రొద్దు టూరులో టిడిపి జెండా ఎగరాలని, ఆ విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు.

చంద్రబాబుతో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి

చంద్రబాబుతో భూపేష్, రిత్వేష్

జమ్మలమడుగు రూరల్ : మంగళగిరిలో జరిగే బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు కార్య క్రమానికి జమ్మల మడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును భూపేష్‌రెడ్డి, బద్వేల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రిత్వేష్‌రెడ్డి కలిశారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన భూపేష్, రిత్వేష్

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No.70/2021

నంద్యాల చిన్న నాగిరెడ్డి .... వాది

V/S

1) నంద్యాల పెద్ద నరసింహ రెడ్డి మరియు ఇతరులు .... ప్రతివాది

To,
పాలూరి నాగ లక్ష్మమ్మ,
W/o. బాల సుబ్బారెడ్డి,
R/o. చిన్న చౌక్ కడప టౌన్ & మండలం, కడప జిల్లా.

దావా సమను

పై నెంబరు కేసులో D3 అయిన నీవు సమన్లు తీసుకోకుండా ఉన్నందున నీ యొక్క హాజరు నిమిత్తం కోర్టు వారు వాయిదా 31-08-2023 వ తేదీన వేసి ఉన్నారు. నీవు ఆ తేదీన స్వయంగా గాని న్యాయవాది గారి ద్వారా గాని కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 31-08-2023

ఇట్లు
బి.శివప్రసాదరావు,
వాది తరపున న్యాయవాది,
ఆళ్లగడ్డ.